క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోండి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రతి మంగళవారం అగ్రీలీగల్ ఎయిడ్‌క్లీనిక్ కార్యక్రమం ఉంటుందని ప్యారా లీగల్ వలంటీర్ కృష్ణయ్యగౌడ్ తెలిపారు. రైతులు న్యాయపరమైన సందేహాలు తీర్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంజనేయులు, లక్ష్మీనారాయణ, శేఖర్, అప్పి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌మీట్‌లో జిల్లా విద్యార్థికి పతకం



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఇటీవలే జరిగిన రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థి గోటూరు కీర్తనరెడ్డి ప్రతిభచాటింది. యోగా పోటీల్లో అండర్–14 విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. మంగళవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ దశరథం విద్యార్థినిని అభినందించారు.

సెమిస్టర్ పరీక్ష వాయిదా వేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు 1న నిర్వహించే సెమిస్టర్ పరీక్షలు, టీజీటీ , పీజీటీ పరీక్షలు ఒకే తేదీన ఉన్నాయని ఏబీవీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని పీయూ వీసీకి పాలమూరు శాఖ ఆధ్వ ర్యంలో మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు అర్జున్, ప్రవీణ్, కృష్ణ, జైపాల్, శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆశయాలు కొనసాగిద్దాం



చిన్నచింతకుంట: కార్మిక సంఘం నాయకుడు నారాయణ స్వామి ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వర్ధంతి సందర్భంగా అమ్మపురంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. నారాయణ స్వామి కుటుంబీకులు వింధ్య, భార్గవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా

జడ్చర్ల: పట్టణ సమీపంలో జాతీయరహదారి 167పై మంగళవారం ఓ లారీ రోడ్డు ప్రమాదానికి గురైంది. గంగాపూర్ రహదారిపై వంద పడకల ఆస్పత్రి సమీపంలో ఘటన జరిగింది. డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

విరబూసిన బ్రహ్మ కమలం



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని బ్రాహ్మణవీధిలో సోమవారం రాత్రి జనార్దన్‌రావు స్వగృహంలో బ్రహ్మకమలం విరబూసింది. అరుదుగా విరబూసే పుష్పాన్ని చూడటానికి చుట్టుపక్కల వారు ఆసక్తి కనబరిచారు.

రైతులను ముంచిన కాంగ్రెస్



తాటిపర్తిలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి

భూత్పూర్: కాంగ్రెస్ హయాంలో రైతులను నిలువునా ముంచిందని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్ రైతులను అన్నివిధాలా ఆదుకుంటే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కేవలం 3 గంటల విద్యుత్తు సరిపోతుందనడం సమంజసంగా లేదని అన్నారు. మండలంలోని తాటిపర్తిలో మంగళవారం రైతువేదికలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో రైతులకు 3 గంటల విద్యుత్తు సరిపోతుందని అనడం వారిని అవమానపరచడమే అవుతుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రైతుబంధు, బీమా, ఉచిత విద్యుత్తు, 24 గంటల కరెంట్ అందించిందని అన్నారు. రైతులకు ఆసరాగా నిలిచిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

రైతులకు అండగా ప్రభుత్వం

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటోందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఖండిస్తూ చేపట్టిన నిరసనలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ విజయ్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండోచైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగిలిన ‘భగీరథ’ మెయిన్ పైపులైన్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జడ్చర్ల నుంచి జిల్లా కేంద్రానికి ఉన్న మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ అప్పన్నపల్లి వద్ద మంగళవారం ఉదయం 8.30 గంటలకు పగిలిపోయింది. దీంతో కొద్దిసేపు తాగునీరు రోడ్డుపైకి వచ్చింది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలాన్ని కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈ హరికృష్ణ తదితరులు పరిశీలించారు. వెంటనే జడ్చర్ల సమీపంలోని ఫిల్టర్ బెడ్స్ నుంచి తాగునీటి సరఫరాను నిలిపివేయించారు. మరమ్మతు కోసం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) అధికారుల అనుమతి తీసుకోవాల్సి వచ్చింది. ఎన్‌హెచ్–167 పై భారీ వాహనాల ధాటికి పగిలిపోయి ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. బుధవారం సాయంత్రం వరకు పైపులైన్‌ను బాగు చేసి ఎప్పటిలాగే పద్మావతీకాలనీలోని అయ్యప్పగుట్టపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు తాగునీటిని యథావిధిగా సరఫరా చేస్తామన్నారు. కాగా దాదాపు 2 నుంచి 3 మీటర్ల లోతులో ఉన్నప్పటికీ పైపులైన్ పగిలిపోవడం గమనార్హం.



పైపులైన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

బిల్లులు రాలే పనులు చేయలేం

రాజాపూర్: సమస్యలకు పరిష్కారం లభించనప్పుడు సమావేశాలు నిర్వహించడం వృథా అని మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు అన్నారు. మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని గత మీటింగ్‌లో చెప్పామని మూడు నెలలు దాటిన పరిష్కరించలేదన్నారు. అలాంటప్పుడు మళ్లీ సమావేశం నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుశీల అధ్యక్షతన మంగళవారం నిర్వహించగా గతంలో చెప్పిన సమస్యలపై సర్పంచ్‌లు మాట్లాడారు. విద్యుత్‌శాఖ ఏఈ సుజాత నివేదికను చదువుతుండగా సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బచ్చిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజాపూర్‌లో ఏడు పోల్స్ ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొనగా త్వరలోనే పరిష్కరిస్తానని ఏఈ వివరణ ఇచ్చారు. అదేవిధంగా కొత్తగా మంజూరైన గ్రామపంచాయతీ భవనాల పనులు ప్రారంభించాలని పీఆర్ఏఈ హలీమ్ సర్పంచ్‌లకు తెలిపారు. కాగా ఇప్పటివరకు చేసిన సీసీరోడ్లు, వైకుంఠధామాలు, మురుగుకాల్వల పనులు చేస్తే బిల్లులు రాలేవని, ఇకపై పనులు చేయబోమని టీబీనగర్ సర్పంచ్ గోవింద్‌నాయక్ అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి సమస్యలను పరిష్కరించుకునేందుకే సమావేశమని గ్రామాల్లో పనులు చేపట్టాలని సర్పంచ్‌లకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, డీటీ భరత్, ఏఎంసీ చైర్మన్ రజిని, ఎంపీఓ వెంకట్‌రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్‌శాఖ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సర్పంచ్ బచ్చిరెడ్డి తదితరులు

అటవీ భూమి కబ్జా.. కేసునమోదు

నవాబుపేట: మండల పరిధిలోని మొగుళ్లపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 10లోని మూడు ఎకరాల అటవీ భూమిని కబ్జా చేశారంటూ సంబంధిత వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు రేంజ్ అధికారి మగ్బుల్‌హుసేన్ తెలిపారు. మంగళవారం భూమిని పరిశీలించగా వీరోట్టిపల్లికి చెందిన వడ్డె వెంకటయ్య కబ్జా చేసినట్లు తేలిందన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసి కోర్టుకు తరలించామని ఆయన వివరించారు. కోర్టు మంగళవారం వెంకటయ్యకు రిమాండ్ విధించిందని అన్నారు. దీంతో జైలుకు తరలించామని అధికారి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



జడ్చర్ల: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఐ రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం రాత్రి జడ్చర్ల–గంగాపూర్ ప్రధాన రహదారిపై పత్తి మార్కెట్‌యార్డు సమీపంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా వ్యాపార వాణిజ్య కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దారి దోపిడీ దారులపై నిఘా వేయాలని, నేరాల నియంత్రణకు సహకరించాలన్నారు. పోలీసుల సేవలను సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

చినుకుపడితే చిత్తడే!



సోమ్లాతండా మట్టిరోడ్డు



దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద

రాజాపూర్: చిన్నపాటి ముసురువర్షానికే మండలంలోని మల్లేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సోమ్లాతండారోడ్డు చిత్తడిగా మారింది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

జడ్చర్ల టౌన్: మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఓ మోస్తారు వర్షం కురవడంతో పాటు ముసురు పడుతోంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ముసురు వల్ల రోజువారీ పనులకు వెళ్లే వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దేవరకద్ర రూరల్: చిన్న పాటి వర్షాలకే మంగళవారం దేవరకద్ర పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయం ఎదుట రహదారి బురదమయంగా మారింది. కనీసం కాలు మోపడానికి కూడా అవకాశం లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నక్కలబండ తండాలో కూలిన ఇల్లు

కూలిన పెంకుటిల్లు

జడ్చర్ల: నక్కలబండ తండాలో సోమవారం రాత్రి వర్షానికి గాంగ్లీకి చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా వంట సామగ్రి, తదితరాలు నాశనమయ్యాయి. వార్డు కౌన్సిలర్ చైతు చౌహాన్ బాధితురాలు గాంగ్లీని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండరాదని అన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

నవాబుపేట: ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలని మండల అభివృద్ధి అధికారి శ్రీలత సూచించారు. మంగళవారం గురుకుంటలో ఇంటింటికీ ఆరు మొక్కలను పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం హరితహారం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ జ్యోతీ, సర్పంచ్ లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

30న బీఆర్‌ఎస్ యువజన సదస్సు

జడ్చర్ల: మాచారం వద్ద బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సదస్సును ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు నాయకులు నాగిరెడ్డి, వీరేష్ తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వివరించారు. అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మండల కేంద్రం నుంచి బుద్దారం వెళ్లే రోడ్డులో 33 కేవీ విద్యుత్ లైన్ వైర్లు తెగి పడ్డాయి. చుట్టు పక్కల పొలాల వారు గమనించి రోడ్డుపై వెళుతున్న వాహనదారులను అప్రమత్తం చేయడంతో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం ముసురు వర్షంలో విద్యుత్ వైర్లు తెగిపడటంతో వాహనదారులు గమనించేలా రహదారికి అడ్డంగా కంపను వేసి ప్రమాదాన్ని నివారించే చర్యలు చేపట్టారు. విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపారు. కానీ మధ్యాహ్నం వరకు రాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



విద్యుత్ వైర్లు తెగి పడటంతో ప్రమాదాన్ని నివారించేందుకు ముళ్ల కంప వేసిన రైతులు

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన

జడ్చర్ల టౌన్: జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో జడ్చర్ల, మిడ్జిల్ మండల ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంగాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా. శివకాంత్, అర్బన్‌హెల్త్ సెంటర్ డా. సమత, మిడ్జిల్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.మనుప్రియ ఉపాధ్యాయులకు నులిపురుగుల మాత్రలపై అవగాహన కల్పించారు. ఈనెల 20న మొదటి విడతగా ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు వివరించారు. వేసుకోని 27న ఇవ్వనున్నట్లు వివరించారు. గంగాపూర్ పీహెచ్‌సీ పరిధిలో 17,150 మందికి, అర్బన్ పరిధిలో 23,210, మిడ్జిల్‌లో 4,560మందికి మాత్రలు వేసేలా ప్రణాళికలు రూపొందించారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు హాజరయ్యారు.

గండేడ్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న కార్యక్రమం నిర్వహించనున్నట్లు గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. సోమవారం సాయంత్రం గ్రామానికి చెందిన బొడ్డన్న మేక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైరును తగిలి కరెంట్ షాక్‌తో మృతి చెందింది. ఈ రోడ్డు పైనే ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రోజూ రాకపోకలు సాగిస్తారు. పిల్లల్లో ఎవరైనా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అజాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రాణాల మీదకు వస్తుంది. రింగులపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఓవైపు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. వేరే చోట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడికి తెచ్చి రోడ్డు పక్కన ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని అంటున్నారు. స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రాహుల్‌ను విమర్శించే హక్కులేదు



భూత్పూర్: మంత్రి కేటీఆర్‌కు రాహుల్ గాంధీని విమర్శించే హక్కు లేదని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసుదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబం అని అన్నారు. ఆయన ఎంతో సామాన్య జీవితం గడుపుతున్నారని పేర్కొన్నారు. కేటీఆర్‌కు ఆయన విమర్శించే స్థాయి లేదన్నారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాధిక్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు ఉన్నారు.

జడ్చర్ల: మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను మంగళవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆధ్వర్యంలో దహనం చేశారు. మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, జిల్లా కిసాన్ ఖేత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ పిలుపుమేరకు మంగళవారం మండల కేంద్రంలో రైతువేదిక వద్ద ఆందోళన చేపట్టారు. మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో మంగళవారం మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపీటీసీలు గోవర్ధన్, సంతోషి, జానంపేట వెంకటేష్ తదితరులు ఉన్నారు.అడ్డాకులలో జగదీశ్వర్, నాగిరెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, నర్సిములు, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

బాలానగర్: మండల ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, తదితరులు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాఘవేందర్, గణేష్ గౌడ్, పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం బొక్కలోనిపల్లి చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ సర్పంచ్ గోవింద్‌యాదవ్, పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండల కేంద్రంలో నాయకులు కిషన్‌రావు, రాఘవేందర్ రెడ్డి, రాధాకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీఆర్‌ఎస్ విశ్వసనీయతను కోల్పోయిందని కాంగ్రెస్ హన్వాడ మండల అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. నాయకులు వేముల కృష్ణయ్య, యాదవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల ముట్టడి



జడ్చర్లలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసనవ్యక్తం చేస్తున్న కార్మికులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు.నాయకులు రాజ్‌కుమార్, వెంకటేశ్, రామ్మోహన్ మాట్లాడుతూ గత 13 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఆదివిష్ణు, ఎర్ర నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మంగళవారం మహ్మదాబాద్ మండల పంచాయతీ కార్మికులు పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఇంటిని ముట్టడించారు. సమస్యలను కేసీఆర్‌కు తెలియజేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించారు.

జడ్చర్ల: సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి తరలివచ్చిన కార్మికులు నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు సత్తయ్య, దీప్లానాయక్, నాయకులు పాల్గొన్నారు.

భూత్పూర్: జేఏసీ జిల్లా చైర్మన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆధ్వర్యంలో అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇంటి ముందు కార్మికులు ధర్నా చేపట్టారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ఆయన సోదరుడు శివవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

కలెక్టర్‌ను దూషించడం సరికాదు

జెడ్పీసెంటర్(మహబూనగర్) : జిల్లా కలెక్టర్ రవి నాయక్‌పై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ నాయకులు అధికారులను ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు.

మిడ్జిల్: టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి బాలానగర్‌లో భూమి కబ్జాకు గురి అయిందని సోమవారం జరిగిన సభలో జిల్లా కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మండల బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ పవార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నవాబుపేట: అనిరుధ్‌రెడ్డి కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని లంబాడీహక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి చందర్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. రాజకీయ వేదికలో అధికారుల ప్రస్తావన సరికాదని అన్నారు. కేసు నమోదు చేయాలని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా జిల్లా అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పురుషోత్తం వివరించారు. సర్పంచ్ నర్సింహనాయక్, తరుణ్‌నాయక్, జిల్లా కార్యదర్శి భగవాన్‌నాయక్, మండల కార్యదర్శి రాజునాయక్ తదితరులు ఉన్నారు.

జడ్చర్లలో శాంతి ర్యాలీ



జడ్చర్ల టౌన్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ మంగళవారం పట్టణంలో నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్, ఎం.బి చర్చి సంయుక్త ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రం సమర్పించారు. పాస్టర్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు విలియంబూత్, ఎంబీచర్చి అధ్యక్షుడు బెంజిమెన్, కార్యదర్శి దేవదానం, పాస్టర్స్, చర్చి సభ్యులు నిత్యానందం, జోసెఫ్, లాజరస్, ఎబినేజర్, నతానియల్‌లు పాల్గొన్నారు. అదేవిధంగా ర్యాలీలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని మణిపూర్‌లో కూల్చిన చర్చిలను పునఃనిర్మించాలని నినదించారు.